

## హరీశ్‌రావును కలిసిన బీఆర్‌ఎస్వీ నాయకులు

రామచంద్రాపురం, డిసెంబర్ 3: పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్‌ఎస్వీ సర్కిల్ అధ్యక్షుడు వాలేశెట్టి క్రాంతి జన్మదినం సందర్భంగా ఆయన మంగళవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రాంతికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని, పార్టీ తప్పనిసరిగా గుర్తింపునిస్తుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్తూ పటాన్‌చెరులో బీఆర్‌ఎస్వీని బలోపేతం చేయాలన్నారు. రాబోయే రోజులు మనవేనని అధైర్యపడవద్దన్ని హరీశ్‌రావు సూచించినట్టు క్రాంతి తెలిపారు. బీఆర్‌ఎస్వీ నాయకులు నగేశ్, శ్రీను, అకిల్, నిఖిల్, సన్నీ, శివకుమార్ ఉన్నారు.

## బోధనా సిబ్బందికి దరఖాస్తుల ఆహ్వానం

రాయికోడ్, డిసెంబర్ 3: రాయికోడ్ కస్తూర్బా గాంధీ పాఠశాలలో బోధించుటకు సిబ్బంది అవసరం ఉందని కేజీబీవీ ప్రిన్సిపాల్ దీపిక మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి కేజీబీవీ పాఠశాల, కళాశాలలో ఇంగ్లిష్, హిందీ, సోషల్, సివిక్స్, గణితం బోధించుటకు అర్హత గల వారు నేరుగా ఈ నెల 5వ తేదీ వరకు కేజీబీవీలో హాజరు కావాలన్నారు. 10 తరగతి వరకు రూ.18 వేలు, ఇంటర్మీడియట్ వరకు రూ.23 వేలు వేతనం ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన ఆసక్తిగల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆక్రమణల తొలగింపు



జహీరాబాద్‌లో ఆక్రమణలను జేసీబీతో తొలగిస్తున్న పోలీసులు

జహీరాబాద్, డిసెంబర్ 3: జహీరాబాద్‌లో ట్రాఫిక్‌తో ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు జహీరాబాద్ పట్టణ పోలీసులు చర్యలు చేపట్టారు. సోమవారం రాత్రి పట్టణంలోని ప్రధాన రహదారి వెంట ట్రాఫిక్‌కు అడ్డంకిగా మారిన ఆక్రమణలను తొలగించారు. కొంతకాలంగా రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్లు, పాన్‌షాపులు, తోపుడు బండ్లు ఇతర వ్యాపార సంస్థలకు సంబంధించిన వాటిని తొలగించారు.

## ఖేడ్ ఎస్‌ఐగా శ్రీశైలం

నారాయణఖేడ్, డిసెంబర్ 3: నారాయణఖేడ్ ఎస్‌ఐగా రాసుల శ్రీశైలం మంగళవారం బాధ్యతలు చేపట్టారు. వికారాబాద్ జిల్లా బంట్వారం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీశైలం ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా ఉన్న విద్యాచరణ్‌రెడ్డి సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో శ్రీశైలం బాధ్యతలు స్వీకరించారు.

## ప్రమాదకరంగా డ్రైనేజీ

హత్నూర, డిసెంబర్ 3: హత్నూర మండలం కాసాల-దౌల్తాబాద్ బస్టాండ్ సమీపంలో నిర్మించిన మురుగు కాల్వపై కప్పు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మంగళవారం మద్యంమత్తులో ఓ వ్యక్తి బస్టాండ్‌లోకి వెళ్తున్న క్రమంలో కాలుజారి మురుగు కాలువలో పడటంతో గమనించిన స్థానికులు వెంటనే అతడిని పైకి తీశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాల్వపైన కప్పు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## హరీశ్‌రావుపై కేసు అక్రమం

జహీరాబాద్, డిసెంబర్ 3: కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయాలనే కుట్ర చేస్తున్నదని బీఆర్‌ఎస్ జహీరాబాద్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ ఆరోపించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా బీఆర్‌ఎస్ నేతలపై అక్రమ కేసులు నమోదు చేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని, ప్రజలు, రైతులకు అండగా ఉంటామనానరు.

## తల్లి, కుమారుడు అదృశ్యం

పటాన్‌చెరు, డిసెంబర్ 3: ఇస్నాపూర్‌లో నివసించే మహిళ తన పదకొండేండ్ల కుమారుడితోపాటు అదృశ్యమైంది. పటాన్‌చెరు సీఐ వినాయక్‌రెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో నివసించే నసీమా బేగం(32) భర్త నాలుగేళ్ల క్రితం మరణించాడు. ఆమెకు 11ఏళ్ల కుమారుడు జునైద్ ఉన్నాడు. నవంబర్ 29న ఇద్దరు అదృశ్యమయ్యారు. తల్లీ కుమారుడు కనిపించట్లేదని ఆమె సోదరుడు గౌస్ పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీకాంతాచారి బలిదానం మరువలేనిది

**మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**



నారాయణఖేడ్: శ్రీకాంతాచారి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, డిసెంబర్ 3: తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆత్మార్పణ చేసుకున్న అమరుడు కాసోజు శ్రీకాంత్‌చారి బలిదానం మరువలేనిదని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. శ్రీకాంత్‌చారి వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం నారాయణఖేడ్ పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అనుక్షణం స్వరాష్ట్రం కోసం పరితపించిన శ్రీకాంత్‌చారి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పట్ల అప్పటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరితో మనస్థాపం చెంది ఆత్మ బలిదానం చేసుకోవడం దురదృష్టకరమన్నారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నగేశ్, నాయకులు సాయిరెడ్డి, విఠల్‌రావు, అంజాగౌడ్, మల్‌గొండ, పార్శెట్టి సంగప్ప, రాజు, గోపాల్, శివ, శంకర్‌నాయక్, సర్దార్‌నాయక్, రాజు ఉన్నారు.

***గుమ్మడిదలలో ఘన నివాళి***

గుమ్మడిదల, డిసెంబర్ 3: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో విద్యార్థుల పోరాటం మరువలేనిదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన గుమ్మడిదలలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన శ్రీకాంతాచారి వర్ధంతిని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర సాధనలో శ్రీకాంతాచారి ఆత్మ బలిదానంతో ఉద్యమం మరింత ఉధృతమైందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మంద భాస్కర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఆకుల సత్యనారాయణ, పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి, సూర్యనారాయణ, ఆంజనేయులు, నల్తూరు యాదగిరి, పోచయ్య పాల్గొన్నారు.




## ఉత్సాహంగా 2కే రన్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 3: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంతో కూడిన జీవన శైలిని అలవర్చుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఐబీ వద్ద సీఎం కప్ 2 కే రన్‌ను అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఐబీ నుంచి కొత్త బస్టాండ్ మీదుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మైదానం వరకు రన్ కొనసాగింది. అనంతరం యువత, విద్యార్థులతో కలిసి వ్యాయామం చేశారు. ట్రైనీ కలెక్టర్ మనోజ్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, యువజన సంక్షేమ శాఖ అధికారి ఖాసీం బేగ్, తహసీల్దార్ దేవదాసు, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జావేద్ అలీ ఉన్నారు.

# అధికారికి వల వేశారు.. పోలీసులు ఎంటర్ కాగానే తోక ముడిచారు



పరిశీలిస్తున్న సైబర్ క్రైం పోలీసులు

జహీరాబాద్, డిసెంబర్ 3: సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా పోలీసుల సహకారంతో భర్తను కాపాడుకుంది. ఫోన్‌లో వీడియో కాల్ మాట్లాడుతుండగానే పోలీసులు ఒక్కసారిగా ఎంటర్ కావడంతో నేరగాళ్లు ఫోన్ కట్ చేసి తోకముడిచారు.. వివరాల్లోకి వెళ్తే.. జహీరాబాద్ పట్టణంలోని మహేంద్ర కాలనీలో నివాసముంటున్న హద్నూర్ గ్రామానికి చెందిన కృష్ణ కులకర్ని క్వాలిటీ కంట్రోల్ అధికారిగా అల్ఫా కంపెనీలో పనిచేస్తున్నాడు. ఉద్యోగానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న తనకు ముంబయి ఎస్‌బీఐ నుంచి అకాశ్‌శర్మ పేరుతో ఫోన్ వచ్చింది. వ్యక్తిగత ఖాతాకు సంబంధించి వివరాలను వీడియో కాల్ ద్వారా తెలపాల్సి ఉంటుందని చెప్పారు. ఆ సమయంలో ఆర్‌బీఐ అధికారులు కూడా ఉంటారని నమ్మబలికారు. వారిద్దరి మధ్య జరుగుతున్న తతంగాన్నంతా గమనిస్తున్న అధికారి భార్య మంజుల కులకర్నికి అనుమానం వచ్చి పట్టణ పోలీసులను ఆశ్రయించింది. సీన్ కట్ చేస్తే... ఎస్‌ఐ కాశీనాథ్ ఆదేశాల మేరకు సైబర్ క్రైం పట్టణ ఇన్‌చార్జి రషీద్ సిబ్బంది కృష్ణ ఇంట్లోకి ఒక్కసారిగా ఎంటరయ్యారు.. కుటుంబ సభ్యుల సంభాషనలు విన్న నేరగాళ్లు సైబర్ క్రైం పోలీసులు వచ్చారని గ్రహించి ఫోన్ కట్ చేశారు. తిరిగి ఆ నంబర్‌కు ఫోన్ చేస్తే కాలవలేదు. పోలీసులు రావడంతో సైబర్ క్రైం నుంచి బయటపడిన కృష్ణ ఊపిరి పీల్చుకున్నాడు. అపరిచితుల ఫోన్లు లిఫ్ట్ చేయొద్దని, వ్యక్తిగత, బ్యాంకు వివరాలు అసలే చెప్పొద్దని సూచించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే 1930 లేదా cybercrime.gov.in కు ఫిర్యాదు చేయాలని కోరారు.

# పరామర్శ.. చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్, డిసెంబర్ 3: మండలంలోని తుర్కపల్లికి చెందిన అవుసలి పండరి, నీరుడి అఖిలకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను మంగళవారం మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పదవి లేకున్నా ప్రజలకు కష్టసుఖాల్లో తోడుంటానని భరోసా ఇచ్చారు.

***పలువురికి పరామర్శ***

తుర్కపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కమ్మరి లక్ష్మయ్య భార్య ఇటీవల మృతి చెందడంతో భూపాల్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తుర్కపల్లి మాజీ సర్పంచ్ భక్తిరామ్ అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స పొందుతున్న అతడిని పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, నాయకులు రవీందర్‌నాయక్, నాయకులు విఠల్‌నాయక్, రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

***కల్హేర్‌లో..***

కల్హేర్, డిసెంబర్ 3: కృష్ణాపూర్ గ్రామానికి చెందిన పెద్దాడే లచ్చవ్వ, మిర్ఖాన్‌పేట్‌కు చెందిన గంగారాం, అలీఖాన్‌పల్లికి చెందిన విస్లావత్ నింబేనాయక్, విస్లావత్ బద్దెనాయక్ ఇటీవల మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వారి ఇండ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాంసింగ్, రాపర్తి మాజీ సర్పంచ్ శ్రావణ్‌కుమార్, నాయకులు రవి, నారాయణ, కుర్మ సాయిలు, కుమ్మరి లక్ష్మయ్య, భీమయ్య, పీరయ్య చంద్రశేఖర్‌రెడ్డి, మల్లేషం, హన్మాండ్లు, గోపాల్‌రెడ్డి, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న జహీరాబాద్ పట్టణ ఎస్‌ఐ కాశీనాథ్

జహీరాబాద్, డిసెంబర్ 3: జహీరాబాద్ పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జహీరాబాద్ పట్టణ ఎస్‌ఐ కాశీనాథ్ హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్సు, ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్‌కు సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడపొద్దని, నో పార్కింగ్ ఏరియాలో వాహనాలను నిలపొద్దని, టేపు రికార్డులను వాడొద్దన్నారు. సడన్‌గా ఎలాంటి సిగ్నల్ ఇవ్వకుండా రోడ్డుపై వాహనాలను ఆపొద్దన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



వీల్ చైర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు

పటాన్‌చెరు, డిసెంబర్ 3: దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరులో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పటాన్‌చెరు సర్కిల్ పరిధిలోని మూడు డివిజన్లకు సంబంధించిన 3 డివిజన్లలోని 225 మంది దివ్యాంగులకు రూ.17 లక్షల 97 వేల రూపాయలతో కొనుగోలు చేసిన వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు, చేతి కర్రలు, ట్రైసైకిళ్లను కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, సింధూఆదర్శ్‌రెడ్డి, పుష్పానగేశ్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శారీరక లోపం ఉన్న దివ్యాంగులు అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారని గుర్తుచేశారు. గతంలో 400 ద్విచక్రవాహనాలను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేశ్, సీఐ వినాయక్‌రెడ్డి, అఫ్జల్ పాల్గొన్నారు.

# జిన్నారంలో ట్రైనీ అధికారుల పర్యటన



గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శిస్తున్న ట్రైనీ మహిళా ఎస్సైలు

బొల్లారం, డిసెంబర్ 3: జిన్నారం గ్రామ పంచాయతీని ట్రైనీ మహిళా ఎస్‌ఐలు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ లావణ్య శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు సమావేశమయ్యారు. గ్రామ పంచాయతీ పరిధిలో పలు అంశాలపై చర్చించారు. శాంతి భద్రతల విషయంలో అమలవుతున్న పద్ధతులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్‌ఐలు కిరణ్, నందిత, గాయత్రీదేవి, చందన, సునీత, స్వర్ణ, సంధ్య, పంచాయతీ సెక్రటరీ మాణిక్యం, సిబ్బంది మల్లికార్జున్ పాల్గొన్నారు.

# సౌకర్యాల కల్పనలో కాంగ్రెస్ విఫలం



బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకులను అరెస్ట్ చేస్తున్న కోహీర్ పోలీసులు

కోహీర్, డిసెంబర్ 3: విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం డివిజన్ అధ్యక్షుడు రాకేశ్ ఆరోపించారు. మంగళవారం దిగ్వాల్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల పరిశీలనకు వచ్చిన బీఆర్‌ఎస్వీ నేతలను అరెస్ట్ చేసి కోహీర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాకేశ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆదేశాల మేరకు గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకు వచ్చామన్నారు. కానీ, పోలీసులు తమను అరెస్ట్ చేయడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనవెంట రవికిరణ్, ఓంకార్, బండిమోహన్, శివప్ప, మధు ఉన్నారు.

# పేదలకు ఇండ్ల స్థలాలివ్వాలి



తహసీల్దార్ భిక్షపతికి వినతిపత్రం ఇస్తున్న జిన్నారం గ్రామస్తులు

బొల్లారం డిసెంబర్ 3: ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వెంచర్ నిర్వాహకులకు కట్టబెట్టేందుకు కుట్ర జరుగుతోందని జిన్నారం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు తహసీల్దార్ భిక్షపతిని కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేదలకు ఇండ్ల స్థలాలు ఇస్తానన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ భూముల్లో మిగిలి ఉన్న స్థలాన్ని పేదలకు కేటాయించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మహేశ్‌యాదవ్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న టీజీఐఐసీ చైర్ పర్సన్, కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 3: పేద ప్రజల కోసం వాసవి మా ఇల్లు సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వాసవి మా ఇల్లు ఆధ్వర్యంలో 1100 మంది వసతి గృహ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయడం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, వాసవి మా ఇల్లు సంస్థ వ్యవస్థాపకుడు తోపాజి అనంతకిషన్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి ప్రకాశ్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొంపల్లి విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ నేతకు ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, డిసెంబర్ 3: బీఆర్‌ఎస్ జహీరాబాద్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ తల్లి అనారోగ్యంతో బాధపడుతున్నది. ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పార్టీ నాయకులతో కలిసి మంగళవారం దవాఖానకు వెళ్లి పరామర్శించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న ఆమెను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను సూచించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ త్వరగా ఆమె కోలుకుంటారని మనోధైర్యం కల్పించారు.



## హ్యుందాయ్ షో రూంల ప్రారంభోత్సవం

ఆర్సీపురంలో ప్యూజన్ హ్యుందాయ్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న హ్యుందాయ్ మోటార్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తరుణ్ గార్గ్, తదితరులు

*- సిటీబ్యూరో, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ)*

# గురుకులాల్లో అధికారుల తనిఖీ



బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

బొల్లారం డిసెంబర్ 3: జిన్నారం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వంటశాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవంలో పాల్గొని వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఎంఈవో కార్యాలయాన్ని సందర్శించారు. ఇన్‌చార్జి ఎంఈఓ కుమారస్వామి, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు మృదుల, విజయ్‌కుమార్, ఎస్‌వో కవిత, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శైలజ, సీఆర్పీ శ్రీనివాస్ ఉన్నారు.

***మొగుడంపల్లిలో..***

జహీరాబాద్, డిసెంబర్ 3: మొగుడంపల్లి మండల కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల కళాశాల, పాఠశాలను మంగళవారం మండల అధికారులు తనిఖీ చేశారు. భోజనశాలలో వంటల తయారీకి ఉపయోగించే నిత్యావసర సరుకులు, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. కళాశాల, పాఠశాల పరిసరాల్లో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలన్నారు. విజయ డెయిరీ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ గోపాల్‌సింగ్, తహసీల్దార్ అసీనాబేగం, మండల అభివృద్ధి అధికారి మహేశ్, విద్యాధికారి జాపర్‌అల్లి, ప్రిన్సిపాల్ హిమబిందు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు

**ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 3: కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన ఏడాది పాలనలో రైతులను నిండా ముంచిందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పారని, 365 రోజులు గడుస్తున్నా అమలు చేయలేదేని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల కోసం అనేక సం క్షేమ కార్యక్రమాలు అమలు చేస్తే, కాంగ్రెస్ ఏ ఒక్క కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. మున్ముందు ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

# అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు



కుంట పరిశీలిస్తున్న ఆర్‌ఐ జయప్రకాష్ నారాయణ

బొల్లారం, డిసెంబర్ 3: 'మట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాలి' అనే శీర్షికతో నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. మంగళవారం తహసీల్దార్ భిక్షపతి ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్ నారాయణ జిన్నారం మండలం గడ్డపోతారం పంచాయతీ పరిధిలోని అలీనగర్ సర్వే నంబర్ 79లోని భైరవ కుంట, చిన్నకుంటలను పరిశీలించారు. అక్రమంగా రాత్రి వేళల్లో మట్టి తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. చెరువులు, కుంటలతోపాటు ప్రభుత్వ స్థలాల్లో ఎట్టి పరిస్థితుల్లో మట్టి రవాణాకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

# నందీశ్వర వాహన సేవలో వీరభద్రుడు



నందీశ్వరవాహన సేవలో ఊరేగుతున్న బొంతపల్లి వీరభద్రస్వామి

గుమ్మడిదల, డిసెంబర్ 3: బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని నందీశ్వర వాహన సేవలో ఊరేగింపు నిర్వహించారు. వీరభద్రుడికి ప్రత్యేక పూజలు, భద్రకాళీ అమ్మవారికి కుంకుమార్చనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈవో శశిధర్‌గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య పాల్గొన్నారు.

## లొద్ద కులస్తుల స్థితిగతులపై ఆర్డీవో విచారణ

సిర్గాపూర్, డిసెంబర్ 3: మండల కేంద్రమైన సిర్గాపూర్, కడ్పల్ గ్రామాల్లో లొద్ద కులాలపై నారాయణఖేడ్ ఆర్డీవో అశోక్ చక్రవర్తి మంగళవారం తహసీల్దార్ ఉమాశంకర్‌తో కలిసి విచారణ చేపట్టారు. లొద్ద కులాలమైన తమను బీసీలో మీసేవ ద్వారా ధ్రువీకరించడంలేదని కలెక్టర్‌కు చేసిన విజ్ఞప్తి మేరకు ఆర్డీవో దరఖాస్తుదారుల ఇంటిని పర్యవేక్షించి వారి స్థితిగతులపై స్థానికులతో విచారణ జరిపారు.

# ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



డాక్టర్ మానసకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, ఆశ వర్కర్లు

సదాశివపేట, డిసెంబర్ 3: ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీ ఎదుట ధర్నా నిర్వహించి డాక్టర్ మానసకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లు పల్స్ పోలియో, లెప్రసీ సర్వేచేసిన పెండింగ్ డబ్బులను తక్షణమే ఇవ్వాలన్నారు. గతంలో సర్వే చేసిన వాటికే డబ్బులు ఇవ్వకుండా మళ్లీ సర్వేలు చేయాలని ఒత్తిడి తేవడం దుర్మార్గమన్నారు. ఎన్నికల ముందు చెప్పినవిధంగా ఆశలకు రూ.18 వేలు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు లావణ్య, స్వప్న, పి.లక్ష్మి, సాయి శిరీష, సరిత, అనిత, పుష్పలత, కృష్ణవేణి, హేమలత, స్రవంతి పాల్గొన్నారు.

***బకాయిలు చెల్లిస్తేనే సర్వే చేస్తాం***

జహీరాబాద్, డిసెంబర్ 3: గతేడాది నిర్వహించిన లెప్రసీ సర్వేతోపాటు పోలియో కార్యక్రమాలకు సంబంధించిన బకాయిలు చెల్లించాలని, అప్పటివరకు లెప్రసీ సర్వే చేయమని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశవర్కర్లు ధర్నా చేపట్టారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని క్లస్టర్ కార్యాలయంలోని సీహెచ్‌వో కార్యాలయం ఎదుట ఆశ వర్కర్లు ధర్నా చేపట్టారు. అనంతరం సీహెచ్‌వో రవికి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్, ఆశ వర్కర్లతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లకు లెప్రసీ సర్వే పేరుతో అదనపు పనులు అప్పజెప్పడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల సీఐటీయూ యూనియన్ అధ్యక్షురాలు శశిరేఖ, ఉపాధ్యక్షురాలు నందమ్మ, నాయకులు లక్ష్మి, శ్యామల, నిర్మల పాల్గొన్నారు.



దుప్పట్లు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ స్రవంతిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

## దుప్పట్లు అందజేత

కోహీర్, డిసెంబర్ 3: మండలంలోని దిగ్వాల్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో వందమంది విద్యార్థులకు మంగళవారం మాజీ జడ్పీటీసీ అరవింద్‌రెడ్డి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు అందజేశారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు దుప్పట్లను అందించినందుకు సంస్థ నిర్వాహకులను ఉపాధ్యాయులు అభినందించారు. పీచెర్యాగడి పీఏసీఎస్ చైర్మన్ స్రవంతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ బక్కారెడ్డి, నాయకులు సవూద్, ఇష్తీకార్ పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ



రామచంద్రాపురం: దివ్యాంగులకు ట్రై సైకిల్‌ని అందజేస్తున్న భెల్ ఈడీ రాజా

రామచంద్రాపురం, డిసెంబర్ 3: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం బీహెచ్‌ఈఎల్‌లో నిర్వహించారు. భెల్ ఈడీ కేబీరాజా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులకు ట్రైసైకిల్స్, వివిధ రకాల పరికరాలను భెల్ అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా కేబీ రాజా మాట్లాడుతూ వైకల్యం శరీరానికే కాని మనస్సుకు కాదని, వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జీఎంహెచ్‌ఆర్ శ్రీనివాస్‌రావు, ఎస్సీ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్, జీఎంలు తదితరులు పాల్గొన్నారు.

***దివ్యాంగులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి***

సిర్గాపూర్, డిసెంబర్ 3: దివ్యాంగులకు ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతారని ఎంఈవో నాగారం శ్రీనివాస్ పేర్కొన్నారు. కడ్పల్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినత్సోవం నిర్వహించారు. దివ్యాంగ బాలలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జీహెచ్‌ఎం వెంకటేశం, బన్సీలాల్, అన్నారావు, సీఆర్‌పీలు శివకుమార్, శోభ, జలీల్ తదితరులు ఉన్నారు.